క్లుప్తంగా

శాకంబరీ అలంకరణలో అమ్మవారు



పూజలో పాల్గొన్న భక్తులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)లో ఆదివారం శ్రీ స్వర్ణ దుర్గ అమ్మవారికి శాకంబరీ అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అమ్మవారికి అభిషేకాలు, పుష్పాంజలి కార్యక్రమాలతో పూజలు నిర్వహించారు. ఈఓ కె.సులోచన దంపతులతో పాటు పలువురు భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి..



మాట్లాడుతున్న ఎస్‌ఐ రాణాప్రతాప్

జూలూరుపాడు: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జూలూరుపాడు ఎస్‌ఐ బి.రాణాప్రతాప్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన ధ్రువపత్రాలు ఉండాలన్నారు. ఆటోడ్రైవర్లు తప్పని సరిగా యూనిఫాం ధరించాలని, అతివేగంగా డ్రైవింగ్ చేయరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. ఆటో ఎక్కే మహిళలు, యువతులు పట్ల మర్యాదగా వ్యవహరించాలని చెప్పారు. కొత్త నేర చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్‌ఐను ఆటోడ్రైవర్లు ఘనంగా సన్మానించారు.

పింఛన్ల రికవరీపై పునరాలోచించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఇతర పెన్షన్ తీసుకుంటూ ఆసరా పెన్షన్ సైతం పొందిన వారి నుంచి రికవరీ చేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై పునరాలోచించాలని పదో వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ కోరారు. ఇప్పటి వరకు అదనంగా తీసుకున్న నగదు తిరిగి జమ చేయాలన్న ఆదేశాలతో వృద్ధులు, వితంతువులు ఆందోళనకు గురవుతున్నారని ఆదివారం ఆమె ఓ ప్రకటనలో తెలిపారు. అనారోగ్యానికి చికిత్స కోసం వెచ్చించిన నగదును తిరిగి చెల్లించమనడం సరికాదని, ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.


కనకాచారికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ 10వ వార్డు నేతాజీ బస్తీకి చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికుడు, సీపీఐ సీనియర్ నాయకుడు ఆలేటి కనకాచారి (62) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మునిగడప వెంకటేశ్వర్లు, తమ్మ సత్తి, బాబురావు, కాంపెల్లి దుర్గయ్య, ఎస్ వీరయ్య, మార్తమ్మ తదితరులు ఉన్నారు.

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల



ప్రమాదకరంగా పాఠశాల గోడలు

కొత్తగూడెంఅర్బన్: కూలీలైన్ ప్రభుత్వ పాఠశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకొని ఎంతోమంది ప్రయోజకులు అయ్యారు. అటువంటి పాఠశాల తరగతి గదులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. వర్షాకాలం తడిచి ప్రమాదంకరంగా ఉంది. దీంతో పాటుగా కొన్ని తరగతి గదులు, పైకప్పు కూడా శిథిలావస్థకు చేరింది. జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టి కూలీలైన్ పాఠశాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి నూతన తరగతి గదలు నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షం వస్తే బస్టాండ్ చెరువే!

- ప్రాంగణంలో భారీగా నిలుస్తున్న వరద నీరు
- డ్రెయినేజీల నిర్మాణంపై అలసత్వం
- పట్టించుకోని అధికారులు

పాల్వంచ: పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ అధ్వానంగా ఉంది. వర్షం కురిస్తే బస్టాండ్ ప్రాంగణంలో నీళ్లు నిలిచి చెరువును తలపిస్తోంది. బస్టాండ్‌కు ఇరువైపులా నీటి మడుగులు ఏర్పడుతుంటాయి. చుట్టూ డ్రెయినేజీ లేకపోవడంతో వర్షం నీరు ఎటూ వెళ్లే పరిస్థితి లేక నిల్వ ఉంటున్నాయి. దీంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి. బస్సు ఎక్కందుకు వచ్చే కొద్దిసేపు కూడా ఈ వాతావరణంలో ఉండలేక పోతున్నారు. బస్టాండ్ పరిసరాల నిర్వహణపై అధికారులు, పాలకులకు పట్టడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చిత్తడిగా దర్శనమిస్తున్న పాల్వంచ బస్టాండ్



బస్టాండ్ ప్రాంగణంలోని వరద నీటిని బయటకు పంపిస్తున్న ఆటో డ్రైవర్లు



అధ్వానంగా బస్టాండ్ లోపలికి వచ్చే రోడ్డు

ప్రయాణికులతో నిత్యం కళకళ...

బస్టాండ్ నిత్యం ప్రయాణికులతో కళకళలాడుతుంటుంది. భద్రాచలం, మణుగూరుకు వెళ్లే బస్సులు ఇక్కడి నుంచి వెళ్లాల్సిందే. ఉమ్మడి రెండు రాష్ట్రాల నుంచి భద్రాచలానికి బస్సులు వస్తుంటాయి. దీంతో ఆయా బస్సులన్నీ పాల్వంచ మీదుగా వెళ్తుంటాయి. ఇక ఇక్కడి నుంచి అనేక జిల్లాలకు, ప్రాంతాలకు వెళ్లేవారు అధికం. కాగా ఇక్కడి బస్టాండ్ విస్తరణకు నోచుకోవడం లేదు.

వర్షం వస్తే నరకయాతన...

వర్షం వస్తే బస్టాండ్‌కు రాకపోకలు సాగించాలంటే నరకయాతన అనుభవించాల్సి ఉంటుంది. బస్టాండ్‌కు ఇరువైపులా పల్లంగా ఉండటం, డ్రెయినేజీ లేక నీళ్లు నిలబడి పోతుంటాయి. ఒక్కోసారి అడుగు లోతు నీళ్లు నిల్వ ఉంటాయి. అటుగా వచ్చిపోయే వాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇక బస్సులు బస్టాండ్ లోపలికి వచ్చే రాజీవ్ గాంధీ మార్కెట్ రోడ్డు మొత్తం గుంతలు పడి దెబ్బతింది. దీంతో బస్టాండ్‌లోకి వచ్చే సమయంలో బస్సులో ఉపేస్తుంటాయి. ఈ రోడ్డు ఇంకెప్పుడు బాగు చేస్తారంటూ స్థానికులు వాపోతుంటారు. ఇక వర్షం నీళ్లు బయటకు వెళ్లకపోవడంతో అక్కడి ఆటో స్టాండ్ డ్రైవర్లే స్వయంగా నీళ్లు బయటికి వెళ్లిపోయేలా కాల్వ తీస్తుంటారు. పాలకులు, అధికారులు దృష్టి సారించి బస్టాండ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

చెరువును తలపిస్తోంది...



వర్షం వస్తే పాల్వంచ బస్టాండ్ చెరువును తలపిస్తుంది. బస్టాండ్ ప్రాంగణం పల్లంగా ఉండటంతో నీళ్లు నిలబడి పోతుంటాయి. బస్టాండ్‌లోని నీళ్లు బయటకు వెళ్లేలా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధ్వానంగా ఉంది. ప్రయాణికుల అవస్థలు అంతా ఇంతా కాదు.

– సర్వేశ్వరరావు, ప్రయాణికుడు

అధికారులు స్పందించాలి



బస్టాండ్‌కు నిత్యం బస్సులు వచ్చిపోతుంటాయి. ప్రయాణికుల తాకిడి కూడా ఉంటుంది. కొద్దిసేపు కూడా బస్టాండ్‌లో ఉండలేం. వర్షం వస్తే ప్రాంగణం అంతా చిత్తడిగా మారుతుంది. అధికారులు వెంటనే స్పందించి వర్షం నీళ్లు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.

– ప్రసాద్‌రావు, స్థానికుడు

'రామసహాయం'కు వినతుల వెల్లువ



ఎంపీ రఘురామిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి ఎంపీగా ప్రమాణ స్వీకారం తరువాత తొలిసారిగా కొత్తగూడెం పట్టణానికి వచ్చిన నేపథ్యంలో సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీకి స్వాగతం పలికారు. ఏరియా గనులకు అనుమతుల విషయంలో వినతిపత్రం అందజేశారు. ఆంతోటి మాట్లాడుతూ... ఏరియాలో వీకే–7 ఇంక్లైన్ ఓపెన్ కాస్ట్ గనికి త్వరగా అటవీశాఖ ద్వారా అనుమతులు ఇప్పించాలని, జీకే ఓసీ గనికి ఎక్స్‌టెన్షన్, ఇల్లందు రొంపేడు ఓసీకి అటవీశాఖ ద్వారా త్వరగా పర్యావరణ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని విన్నవించారు. స్పందించిన ఎంపీ మీ సమస్యకు వీలైనంత త్వరలో పరిష్కారమార్గం చూస్తామన్నారు. మధుసూదన్‌రావు, జిమ్మిడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సింగరేణి స్థలం కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ 31వ వార్డు ఇన్‌చార్జ్ జెల్లి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆళ్ల మురళి, నాగసీతారాములు, నాగేంద్ర త్రివేది, కంచం గురువులు, మోజెస్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రిజర్వేషన్ పెంచాలని...

రాష్ట్రంలో ఎస్సీ కులాల రిజర్వేషన్ పెంచాలని కోరుతూ షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కండె రాములు, సలిగంటి కొమరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఈ నెల 21న ఇఫ్టూ అనుబంధ ఆటో మోటారు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని ముకుందాపురం క్యాంపు సెంటర్‌లో ఆదివారం వాల్‌పోస్టర్లను ఇఫ్టూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇల్లెందు బ్రాంచ్ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ.. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో తెలంగాణ రాష్ట్ర రవాణా రంగంలో పనిచేస్తున్న 25లక్షల మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. డ్రైవర్లకు ఉరితాడుగా మారిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, పెనాల్టీలు, అక్రమ వసూళ్లకు పాల్పడటంతో డ్రైవర్ల పరిస్థితి అగ్యమగోచరంగా మారిందన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ఉద్యమకార్యాచరణ లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో నూనేశ్వరరావు, కోటయ్య, అంజయ్య, జగన్, సైదులు, రవి, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా పీరీల ఊరేగింపు



పీరీల ఊరేగింపు చేస్తున్న భక్తులు

టేకులపల్లి: ఈనెల 17న ముస్లింలకు ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభదినమైన మొహర్రం పండుగను పురస్కరించుకుని టేకులపల్లి మండలంలో పీరీల సందడి మొదలైంది. న్యాయం, సత్యం, ధర్మం, మానవీయ విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన మహ్మద్ ప్రవక్త మనవళ్లు హజ్రత్ ఇమామ్ హసేన్, ఇమామ్ హుస్సేన్‌ల త్యాగానికి ప్రతీకగా మొహర్రం పండుగను జరుపుకుంటారు. మూడుతండా, బోడు, మద్రాస్ తండా తదితర గ్రామాల్లో పీరీల కొట్టం (ఆషిర్ ఖానా)ల వద్ద అమరుల త్యాగ నిరతిని స్మరిస్తూ వారి జ్ఞాపకంగా పీరీలను ప్రతిష్ఠించారు. ప్రతీరోజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం మూడుతండాకు చెందిన పీరీతో భక్తులు మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. పలువురు పీరీలకు ఎదురెళ్లి ఆశీర్వాదాలు పొందారు.

పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి



హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమేష్ రాథోడ్ తదితరులు

పాల్వంచరూరల్: పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని జాతీయ గిరిజన కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేసినట్లు గ్రీన్‌ఎర్త్ సొసైటీ నిర్వాహకులు రమేష్ రాథోడ్ ఆదివారం తెలిపారు. మాట్లాడుతూ..

పాల్వంచ పర్యటనకు వచ్చిన ఎస్టీ కమిషన్ సభ్యులకు శనివారం రాత్రి జరిగిన సన్మానసభలో కలిసి సమస్యను విన్నవించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న మణుగూరు, మందమర్రి, పాల్వంచ, భద్రాచలం మున్సిపాలిటీలుగా మార్చి, ఏజెన్సీ, నాన్‌ఏజెన్సీ వివాదాన్ని తేల్చి ఎన్నికలు నిర్వహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కోరినట్లు వివరించారు. దీనివల్ల ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయారు. అభివృద్ధి పనులు జరగటం లేదని, చెప్పుకుందామంటే సంబంధిత అధికారులు లేరని, ఎవరి చెప్పినా అది మా పని కాదంటున్నారని తెలిపారు.

పాముల భయం.. దొంగల బెడద

టేకులపల్లి: టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బాలికల మరుగుదొడ్ల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు అడవిని తలపిస్తున్నాయి. ఈ పొదల్లోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉండడం గమనార్హం. ఈ కారణంగా పాములు, తేళ్లు, విషపుకీటకాలు తరగతి, ప్రిన్సిపాల్ గదుల్లో సంచరిస్తున్నాయి. మరో విచిత్రం.. కాలేజీ పాత భవనం వరండాలో ఉన్న మార్బుల్‌ను తవ్వి మరీ దుండగులు ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా సెలవురోజుల్లో కాలేజీలోని విద్యుత్ సర్వీసు వైరుని సైతం దొంగలు ఎత్తుకెళ్తుండటం నిత్యకృత్యంగా మారింది. కాలేజీకి ప్రహరీ లేకపోవడంతో ఇలాంటివి జరుగుతున్నాయని ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అడవిని తలపిస్తున్న పిచ్చి మొక్కలు

ఉద్యోగావకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న నరసింహారావు

జూలూరుపాడు: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు అన్నారు. ఆదివారం ఆయన వెంగన్నపాలెంలో మాట్లాడుతూ.. మండలంలోని నిరుద్యోగులకు మిషన్ భగీరథలో అవుట్ సోర్సింగ్ విధానంలో పంపు ఆపరేటర్ల ఉద్యోగాలు ఇవ్వాలని ఎల్‌అండ్‌టీ సంస్థను కోరారు. వేర్వేరు జిల్లాలు, మండలాల నుంచి జూలూరుపాడు మండలం వచ్చి మిషన్ భగీరథ పంపు ఆపరేటర్ల ఉద్యోగం చేస్తుండటంతో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరగపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ఈ ఉద్యోగ అవకాశాన్ని ఇక్కడి నిరుద్యోగులకు కల్పించే విధంగా ఎల్‌అండ్‌టీ సంస్థ వారు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొమ్ముగిరి కామేశ్వరరావు, చెంగల నాగరాజు, కాకటి నరేందర్, ఎస్ రమేష్, వెంకటేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎండైనా, వానైనా ఆరుబయటే!



హాస్టల్ ఎదుట నిరీక్షిస్తున్న తల్లిదండ్రులు

సింగరేణి(కొత్తగూడెం): పిల్లల వీక్షణ కోసం వచ్చిన తల్లితండ్రులు హాస్టళ్ల ఎదుట అగచాట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఆదేశాలిచ్చేంత వరకు ఆరుబయటే ఉండాల్సి వస్తోంది. ఎండైనా, వానైనా అంతే ఆరుబయటే ఉండాల్సిన దుస్థితి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రామవరం గిరిజన గురుకుల బాలికల సంక్షేమ హాస్టల్ చోటుచేసుకుంటోంది. ఆదివారం, సెలవు రోజుల్లో హాస్టళ్లలో ఉన్న పిల్లలను చూసేందుకు వస్తే వారికి లోనికి పంపించాల్సిన సిబ్బంది టైమ్ పేరుతో, బాలికల హాస్టల్ పేరుతో ప్రవేశం ఇవ్వటం లేదు. మరి ఇలాంటి సమయంలో వారికి కనీసం నీడనైన ఏర్పాటు చేయకుండా గంటల తరబడి బయటే నిలబెడుతున్నారు. దూరం నుంచి వచ్చిన వారికి కనీసం షెడ్డు కూడా ఏర్పాటు చేయలేదు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి బాలికల హాస్టల్ కాబట్టి ఎక్కువగా తల్లిదుండ్రులు, అక్కాచెల్లెళ్లు వస్తుంటారు వీరికి ఒక షెడ్డు, టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

పెరుగుతున్న జ్వర బాధితులు



ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో పేషంట్లు

ఇల్లెందు: వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాలు వృద్ధి చెందుతున్నాయి. వారంరోజుల నుంచి ఆస్పత్రులకు వచ్చే జ్వరపీడితుల సంఖ్య పెరిగిపోతోంది. ముఖ్యంగా జలుబు, దగ్గు, గొంతు నొప్పితో పాటు కాళ్లు, కీళ్ల నొప్పులు విపరీతంగా ఉంటున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నీటి కాలుష్యం వల్ల శరీరం మీద దుద్దుర్లు కూడా వస్తున్నట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా హాస్టళ్లలో విద్యార్థులు తేమ ఉన్న దుస్తులు ధరించటం, చన్నీటి స్నానాల వల్ల హాస్టల్ పిల్లలకు దుద్దుర్లు, జలుబు, జ్వరాలు వస్తున్నాయి. గ్రామాల్లో దోమలు, ఈగలు వృద్ధి చెందాయి. ఇళ్ల పరిసరాల్లో చెత్తచెదారం వల్ల దోమలు పెరిగిపోతున్నాయి. పశువుల పాకల వల్ల పేడ, మూత్రం దుర్వాసన వల్ల కూడా ఈగలు, దోమలు ఉంటున్నాయి. వర్షాకాలం వచ్చినా తాగునీటిని క్లోరినేషన్ చేయకపోవటం వల్ల నీటి కాలుష్యం వల్ల కూడా రోగాలు పెరుగుతున్నాయి. ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి ప్రతీరోజు 300 మంది రోగులు వస్తే అందులో 150 మంది వరకు జ్వరపీడితులు ఉంటున్నారు. ముఖ్యంగా ఇందులో 50 మంది వరకు టైఫాయిడ్, కీళ్ల నొప్పులు వంటి రోగాలతో వస్తున్న వారే ఉంటున్నారు. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నప్పటికీ ప్రజలకు ఆ నీటిని తాగాలని అవగాహన కల్పించకపోవటం వల్ల నూరు శాతం ప్రజలు ఆ నీటిని తాగడం లేదు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది?

- దోమకాటుతో అనర్థాలెన్నో
- నివారణపై శ్రద్ధ వహించాలి
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు

సుజాతనగర్: వర్షాకాలం ప్రారంభమైంది. దీంతోపాటే దోమల సీజన్ కూడా మొదలైంది. చిన్న దోమే కదా.. అని అజాగ్రత్త పనికిరాదు. దోమకాటుతో జీవితంపై వేటుపడే అవకాశం లేకపోలేదు. దోమల నివారణ, నియంత్రణపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. లేదంటే అనారోగ్యంతో పాటు, ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. అంతేకాదు ఒక్కోసారి ప్రాణం పరిస్థితి సైతం తలెత్త వచ్చు. అందుకే వర్షాకాలంలో దోమల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వర్షాకాలంలో దోమకాటు వలన వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సుజాతనగర్ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రమేష్ ఇలా వివరించారు.

దోమల వృద్ధి ఇలా...

ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీటి గుంతలు, కంపచెట్లు, పిచ్చిమొక్కలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు నివాసం చేస్తాయి. ఈ ప్రాంతాల్లో గుడ్డు, లార్వా, ప్యూపా వృద్ధి చెంది దోమగా మారుతుంది. ఈ ప్రమాదాన్ని నివారించాంటే నీటిని సక్రమంగా వినియోగించాలి. దోమల నివారణ మందులను వాడాలి. పారిశుద్ధ్యం పాటించాలి.

దోమలతో వచ్చే వ్యాధులివే:

అనాఫిలిస్‌తో మలేరియా...

చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం వస్తుంది. వ్యాధి ప్రారంభంలో సరైన చికిత్స చేయించకపోతే నెలల తరబడి బాధిస్తుంది. అనాఫిలిస్ దోమలతో వ్యాప్తి చెందే ఈ వ్యాధి వర్షాకాలంలో ఎక్కువగా ప్రబలుతుంది. గర్భిణులకు, చిన్నారులకు ఈ వ్యాధి సోకితే తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

నివారణ..

చలితో జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి నిర్ధారణ అయితే సకాలంలో మందులు వాడుతూ జాగ్రత్తలు తీసుకోవాలి.

క్యూలెక్స్‌తో మెదడువాపు...

హఠాత్తుగా విపరీతమైన జ్వరం వస్తుంది. నీటి నిల్వలో పెరిగే క్యూలెక్స్ దోమతో ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈ వ్యాధిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా తీవ్ర పరిణామాలు ఉంటాయి. ప్రధానంగా ఈ వ్యాధి చిన్న పిల్లలకు సోకి మరణాల వరకు తీసుకెళ్తుంది. లేదంటే శాశ్వత అంగవైకల్యం కూడా ఏర్పడవచ్చు. ఈ వ్యాధిని చికిత్స ద్వారా నియంత్రించడం కష్టం కాబట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం.

ఇలా చేయాలి...

పంట పొలాలు, పెద్దపెద్ద స్థలాలు, మైదానాల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధి నివారణకు ఇచ్చే టీకాలను తప్పకుండా తీసుకోవాలి. పందులను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలి. వ్యాధిగ్రస్తులను గుర్తించి సత్వరమే వైద్యం అందించాలి. చిన్నపిల్లల పట్ల ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎడిస్‌తో చికెన్ గున్యా, డెంగీ...

అకస్మాత్తుగా ఎముకలు, కండరాలు, కీళ్లనొప్పులతో కూడిన జ్వరం వస్తుంది. తగ్గినట్లుగానే తగ్గి వారం లేదా పది రోజుల్లో మళ్లీ తిరగబెడుతుంది. ఎడిస్ దోమకాటు కారణంగా ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. కాళ్లలో నొప్పి, శరీరంపై చిన్నచిన్న దద్దుర్లు వస్తాయి. డెంగీ, చికెన్ గున్యా వ్యాధి లక్షణాలు దాదాపుగా ఒకేలా ఉంటాయి. చిన్నచిన్న కీళ్ల వద్ద విపరీతమైన నొప్పులు ఉంటాయి. నెలల తరబడి ఈ నొప్పులు బాధిస్తాయి.

ఇలా చేయాలి...

దోమలను నివారించాలి. ఎప్పటికప్పుడు నీటి నిల్వలను తొలగించాలి. వ్యాధి పట్ల సరైన అవగాహన పెంచుకుని తగిన చికిత్స చేయించుకోవాలి.

క్యూలెక్స్ మాన్సోనియాతో బోదకాలు..

తరచూ జ్వరం వస్తుంది. చంకలు, గజ్జల్లో బిళ్లలు కట్టడం వాపు లాంటివి వస్తాయి. క్యూలెక్స్ మాన్సోనియా దోమతో వచ్చే ఈ వ్యాధి ఎవరికైనా సోకుతుంది. వ్యాధికారక క్రిమి శరీరంలోకి ప్రవేశించిన కొన్ని సంవత్సరాలకు లక్షణాలు కనిపిస్తాయి.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.



దోమతెరలు, దోమలను పారదోలే పరికరాలను ఉపయోగించడం మంచిది. గుంతలు, లోతట్టు ప్రాంతాలు, వినియోగంలో లేని బావులను పూడ్చి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. మురుగు కాల్వలో చెత్తచెదారం లేకుండా చూసుకోవాలి. మురుగుకాల్వలు సజావుగా పారేట్లు చూసుకోవాలి.

– డాక్టర్ రమేష్

ఆషాఢ బోనమెత్తిన 'పాపకొల్లు'



నృత్యం చేస్తున్న భక్తుడు



బోనాలతో వస్తున్న మహిళలు

జూలూరుపాడు: బోనాల పండుగను పాపకొల్లు గ్రామ ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శ్రీకోటమైసమ్మ తల్లికి బోనాలను సమర్పించేందుకు గ్రామ పంచాయతీ, పరిసర గ్రామాల మహిళలు, యువతులు, పిల్లలు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆషాఢమాసం ప్రారంభం నుంచి శ్రావణమాసం ముగిసే వరకు తెలంగాణ ప్రాంత ప్రజలు శ్రీకోటమైసమ్మ తల్లి, శ్రీముత్యాలమ్మ తల్లి, శ్రీపెద్దమ్మ తల్లి, శ్రీపోలేరమ్మ తల్లులకు బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. మహిళలు, యువతులు, పిల్లలు బోనాలను తలపై పెట్టుకొని గ్రామ కూడలిలో ఉన్న బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేసి, తరువాత శ్రీకోటమైసమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. కోళ్లు, మేకలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.